క్లుప్తంగా

ఒత్తిడిని జయించాలి



ప్రసంగిస్తున్న డా.సీ సయ్యద్ సలీంబాషా

కర్నూలు(అర్బన్): ప్రతి ఒక్కరు సానుకూల ఆలోచనతో ముందుకు వెళ్తే ఒత్తిడిని సులభంగా జయించి విజయం సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.సి. సయ్యద్ సలీం బాషా అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని నెం:2 కళాశాల బాలికల వసతి గృహంలో మోటీవేషన్ క్లాసులు నిర్వహించారు.వసతి గృహం సంక్షేమ అధికారిణి కె.శిరీష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సలీంబాషా మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థినులు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని విడనాడాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన పాఠ్యాంశాలను ముందుగా శ్రద్ధగా వినేందుకు ప్రయత్నించాలన్నారు.

చిన్నారులందరికీ టీకాలు



టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్‌ఎంలు తమ పరిధిలో అర్హులైన చిన్నారులందరికీ టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక గడ్డవీధిలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న పెద్దపడకానా, దండగేరిలో జరుగుతున్న టీకా ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణిలకు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలు ఉండే శీతలీకరణ పరికరాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు కాన్పునకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి,ఆ వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలన్నారు.ప్రమాదకర చిహ్నాలున్న గర్భిణులను మూడు రోజుల ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ సెట్‌కు నోటిఫికేషన్ ఇవ్వండి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ఎలిజిబులిటీ టెస్టుకు (ఏపీ సెట్) నోటిఫికేషన్ ఇవ్వాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ చంద్రప్ప కోరారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనా శాఖా మంత్రి గుమ్మనూరు జయరాంను స్థానిక జిల్లా పరిషత్‌లో కలిసి వినతి పత్రం అందించారు. మంత్రులను కలిసిన వారిలో ఏపీ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అమృత్‌కుమార్, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పీ వెంకటేష్, గౌతంనాయక్, ఎస్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

స్ఫూర్తిప్రదాత తిలక్

కర్నూలు(హాస్పిటల్): అందరికీ స్ఫూర్తి ప్రదాత బాలగంగాధర తిలక్ అని కంటి వైద్యనిపుణులు డాక్టర్ పి. సుధాకర్‌రావు చెప్పారు. బాలగంగాధర్ తిలక్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక బుధవారపేటలోని సుశీల నేత్రాలయ హాస్పిటల్ వద్ద శ్రీ లక్ష్మీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజీకి అరుదైన గుర్తింపు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి

కర్నూలు సిటీ: నగర శివారులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీకి అరుదైన గుర్తింపు లభించింది. ఉత్తమ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందున్న ఈ కాలేజీకి లింక్డ్ ఇన్ సంస్థ ఉత్తమ లీడర్ సమ్మేళం అవార్డు ప్రకటించింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.కేఈ శ్రీనివాసమూర్తి ఆ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రిన్సిపాల్, అధ్యాపకులను కాలేజీ చైర్మెన్ జీవీఎం మోహన్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ డా.వైపాండు రంగయ్య, అడ్మినిస్ట్రేటివ్ డీన్ డా.గిరిధర్‌కుమార్ అభినందించారు. అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని చైర్మెన్ చెప్పారు.

సబ్సిడీ టమాటకు పోటెత్తారు



కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా శనివారం వినియోగదారులకు టమాట పంపిణీ చేశారు. సబ్సిడీపై కేజీ రూ. 50కు ఇస్తున్న టమాటలను పొందేందుకు వినియోగదారులు పోటెత్తారు.



లలితా పీఠంలో ప్రత్యేక అలంకారంలో గోదా దేవి,



గోదా గోకులంలో అమ్మవారి జయంత్యుత్సవాలకు హాజరైన భక్తులు

వైభవంగా గోదా దేవి జయంత్యుత్సవం

కర్నూలు కల్చరల్: తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని గోదా దేవి జయంత్యుత్సవం శనివారం నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మామిదాలపాడు సమీపంలో ఉన్న గోదా గోకులంలో అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం చేశారు. గోదా దేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పల్లకీ, పవళింపు సేవలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో గోదా దేవి జయంతి పూజా మహోత్సవం జరిగింది. శ్రీరంగధామం పారాయణ బృందం అధ్యక్షుడు బిలకంటి మురళీధర్ బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. శ్రీ గోదా అమ్మవారికి పంచామృతాభిషేకం, తిరుప్పావై పారాయణం చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం భక్తులకు సందేశం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు సచివాలయాల విద్యా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో వార్డు విద్యా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెడ్ మాస్టర్ల సహాయంతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నగర పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

ఉల్చాల జంక్షన్ పనులు వేగవంతం చేయండి

నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలోని ఉల్చాల రోడ్డు వద్ద చేపడుతున్న జంక్షన్ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం ఆయన ఆ పనులను పరిశీలించారు. నగరంలోని ముఖ్య మైన ప్రాంతాల్లో జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే బంగారుపేట, బిర్లాగేట్ వద్ద పనులు చేపడుతున్నట్లు చెప్పారు. బళ్లారి చౌరస్తా నుంచి కోడుమూరు-ఉల్చాల రోడ్డు నిత్యం బిజీగా ఉంటుందని, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రద్దీని నియంత్రించేందుకు ఇక్కడ జంక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, డీఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాల కూల్చివేత

నగరంలో ప్లాన్‌కు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు శనివారం కూల్చివేశారు. స్థానిక నరసింగరావు పేటలోని మదర్ థెరిస్సా విగ్రహం సమీపంలో సెట్‌బ్యాక్స్ లేకుండా చేపడుతున్న అనధికారిక నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హరీష్ చౌదరి ఆధ్వర్యంలో తొలగించారు. ఇప్పటికే అనేక వాణిజ్య భవనాలకు నోటీసులు జారీ చేశామన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా కట్టిన నిర్మాణాలపై వేటు తప్పదన్నారు.

అత్యాచారానికి పాల్పడిన మృగాలను శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): మణిపూర్‌లో గిరిజన మహిళలపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బి. గిడ్డమ్మ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మహిళా సమైక్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నరేంద్రమోదీ రాజకీయాలే మణిపూర్ ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. బీజేపీ కావాలనే రెండు వర్గాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. వెంటనే మణిపూర్ ముఖ్యమంత్రి బీరేంద్రసింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

కర్నూలు(లీగల్): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించారు. మోటారు ప్రమాద కేసులను ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు బి.మురళీ మనోహర్ పరిష్కారం చేశారు. భూసేకరణ కేసులను అదనపు సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ పరిష్కారం చేసి బాధిత రైతులకు ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం అందజేశారు. 53 మోటారు ప్రమాద కేసుల్లో రూ.4.81 కోట్లు చెల్లించేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు సమ్మతించాయి. కార్యక్రమంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మల్లికార్జున, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు తావు లేకుండా విద్యుత్ పనులు

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు, గాలి వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే తగిన జాగ్రత్తలతో పనులు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా చినుకులు పడుతుండటంతో గాలి అధికంగా వీస్తోందని, దీని వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ ఉంటుందని చెప్పారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈలు, ఏడీఈలు, ఈఈలు తమ పరిధిలోని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లకు తగిన సూచనలు ఇవ్వాలని చెప్పారు.

మెదడు సంబంధ వ్యాధులపై అవగాహన అవసరం

కర్నూలు(హాస్పిటల్): మెదడుకు వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. శనివారం ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా కళాశాలలో ఎస్‌పీఎం విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ పక్షవాతం, మతిమరుపు, అల్జీమర్స్, మైగ్రేన్ తలనొప్పి, మూర్ఛరోగం, ట్యూమర్ వంటి 400 రకాల మెదడు వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య ప్రపంచంలో 16 శాతం ఉందన్నారు. ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కావున ప్రజల్లో అవగాహన ద్వారా ఈ భారాన్ని తగ్గించేందుకు ఏటా జులై 22న ప్రపంచ బ్రెయిన్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన మెదడు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డుప్రమాద నివారణ చర్యలు, పక్షవాత నివారణ పద్ధతుల గురించి వివరించారు. పౌష్టికాహారం, పరిపూర్ణ నిద్ర, వ్యాయామం, బీపీ, మధుమేహ నియంత్రణ, మద్యపాన నిషేధం వల్ల మన మెదడు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హరిచరణ్, ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ సీవీ.రావు, న్యూరోసర్జన్ డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, న్యూరాలజిస్టు డాక్టర్ ఎం.ఎస్. అరుణ, అనాటమి వైద్యులు డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన పెంచండి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీలత



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌సీ డీడీఏ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): పొలంబడి కార్యక్రమాల ద్వారా పంటల సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. శనివారం కర్నూలు సబ్ డివిజన్ కార్యాలయంలో పొలంబడి కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొలంబడి కార్యక్రమాలను 100 శాతం ఫలవంతంగా నిర్వహించాలనే లక్ష్యంతో గత ఏడాది కంటే ఈ సారి తక్కువ స్థాయిలో నిర్వహిస్తున్నామని, మండలానికి రెండు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పంటలైన పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి పంటలకు సంబంధించి వారం, వారం పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మండలస్థాయిలో ఒక పొలంబడిని ఏవో, మరో పొలంబడిని ఆర్‌బీకే ఇన్‌చార్జ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో పొలంబడి నిర్వహించే గ్రామాలను ఎంపిక చేశామన్నారు. పొలంబడి కార్యక్రమం వివరాలను ప్రతివారం పొలంబడి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, రవిప్రకాశ్, మల్లేష్‌యాదవ్, శ్రీవర్ధన్‌రెడ్డి, సుధాకర్ ఆర్‌బీకే ఇన్‌చార్జీలు, ఏఈవోలు పాల్గొన్నారు.

పోలీసు డైరీ


చోరీ చేస్తూ పట్టుబడిన బాలలు

కర్నూలు: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో టూల్ బాక్సుల్లో ఉన్న డబ్బులను చోరీ చేస్తూ పట్టుబడిన ముగ్గురు బాలలను ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు అప్పగించారు. కర్నూలు హంద్రీ బ్రిడ్జి పక్కన ఉన్న కాలనీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములతో పాటు మరో బాలుడు కలసి కొంతకాలంగా స్టాండ్లలో పార్కు చేసి ఉంచిన ఆటో టూల్ బాక్సులు తెరిచి అందులో ఉన్న డబ్బును తస్కరించి జల్సా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ప్రభుత్వాసుపత్రితో పాటు మౌర్యా ఇన్, కొండారెడ్డి బురుజు దగ్గర ఉన్న ఆటో స్టాండ్లలో కొంతకాలంగా ఆటో టూల్ బాక్సుల్లోని డబ్బులను తస్కరించినట్లు బాలలు పోలీసు విచారణలో అంగీకరించారు. దీంతో వారి తల్లిదండ్రులను పిలిపించి మూడవ పట్టణ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలా చోరీలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జ్యువైనల్ హోమ్‌కు తరలిస్తామని తీవ్రంగా హెచ్చరించి పంపారు.

మట్టి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీలతో మట్టిని తవ్వి రెండు లారీల్లో తరలిస్తుండగా సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో పట్టుబడిన లారీలను పాణ్యం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు : మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణంకావొద్దని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం వాహనదారులను హెచ్చరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం రాత్రి సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. నగర శివారులోని తెలంగాణ రాష్ట్రం సరిహద్దు టోల్‌ప్లాజా వద్ద ఉన్న మద్యం దుకాణాల్లో మద్యం సేవించి కర్నూలు వైపు వస్తున్న వాహనదారులను పోలీసులు పట్టుకున్నారు. రెండు కార్లు, 15 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు కలిపి మొత్తం 21 వాహనాలను సీజ్ చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండోసారి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే క్రిమినల్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

అవీ-ఇవీ

వైద్య ఆరోగ్యశాఖ ఏఓగా నాగమణి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏఓగా ఎ. నాగమణిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ వి. రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించి వైద్య ఆరోగ్యశాఖకు బదిలీ చేశారు.

మహాపాదయాత్రకు మద్దతు

కర్నూలు(రూరల్):జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం తలపెట్టిన మహా పాదయాత్రకు మద్దతునిస్తున్నట్లు సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఈ నెల 26 నుంచి 31 వరకు జరిగే మహా పాదయాత్రలో తాము పాల్గొంటున్నట్లు సివిల్ సప్లై డీఎంకి శనివారం వినతి పత్రం అందజేశారు.

మరో ముగ్గురికి చోటు

కర్నూలు(రూరల్): జిల్లా కాంగ్రెస్ కమిటీలో మరో ముగ్గురికి చోటు లభించినట్లు డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు తెలిపారు. శనివారం నగరంలోని కళా వెంకట్రావ్ భవనంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు నగరానికి చెందిన ఎస్.చంద్ర శేఖర్‌ను ఉపాధ్యక్షుడిగా, లాజరస్, అమానుల్లా (హొళగుంద)ను సంయుక్త కార్యదర్శులుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(రూరల్): హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజిబాబు, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కేకే భవనంలో హమాలీ కార్మికుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు బి.ప్రవీణ్ శనివారం డీఈఓ ఆఫీస్ ఏడీ శ్యామూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆర్‌యూలో శ్రమదానం

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ వర్సిటీలో సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీవీ కృష్ణారెడ్డి, ఎన్‌టీకే నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా బాయ్స్ హాస్టల్ ఆవరణలో ముళ్ల చెట్లు, చెత్తను తొలగించి శుభ్రపరిచారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌టీకే.నాయక్ సూచించారు.

స్లాబ్ శిథిలావస్థలో ఉన్నందునే లీకేజీ

కర్నూలు(అర్బన్): జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ భవనం స్లాబ్ శిథిలావస్థకు చేరడం, స్లాబ్‌లో క్రాక్స్ ఉన్నందున కురుస్తున్న వర్షాలకు లీకేజీ ఏర్పడిందని ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ జి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భవనానికి చేపట్టిన పనులకు ఇప్పటి వరకు రూ.10 లక్షలను డీఏఓ విడుదల చేశారని, ఇంకా 8.20 లక్షలు విడుదల చేయాల్సి ఉందన్నారు. స్లాబ్‌లోని కడ్డీలు 75 శాతం తుప్పు పట్టిన నేపథ్యంలో స్లాబ్ జాయింట్ వద్ద మరమ్మతులు చేపట్టేందుకు వీలు పడదన్నారు.

మాది సంక్షేమ పాలన



4 వ వార్డులో దరఖాస్తుదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎన్నికల వేళ టోకన్లు ఇచ్చే టీజీ కుటుంబాన్ని నమ్మొద్దు
- నాలుగేళ్లు చంద్రబాబు, పవన్ ఎక్కడ ?
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని తమ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక 4,15,51 వార్డుల పరిధిలోని 9,10,35,36,129,130వ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తున్న ప్రభుత్వం తమదన్నారు. నాలుగేళ్లుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. ఇంకా అర్హత ఉండి అందని వారు ఎవరైనా ఉంటే వారికి కూడా లబ్ధి చేకూర్చాలని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో నెలరోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇంటింటికి వెళ్లి సచివాలయాల సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరంలో అవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ , పార్టీ నగర నాయకురాలు సిత్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరోనా వేళ చంద్రబాబు, పవన్ ఎక్కడ?

నాలుగేళ్లుగా వలంటీర్ల వ్యవస్థ గురించి మాట్లాడని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఆ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మండిపడ్డారు. వలంటీర్లను నీచంగా అవమానిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ కరోనా వేళ ఎక్కడ దాక్కున్నారన్నారు. ప్రాణాలు తెగించి సేవలు అందించిన వలంటీర్లను తక్కువ చేసి మాట్లాడితే ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతారన్నారు.

టీజీని నమ్మొద్దు

నాలుగేళ్లు పత్తాలేని టీజీ కుటుంబం ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఓట్ల కోసం టోకెన్లు, ఉచిత బహుమతులు, డబ్బులు ఎర వేస్తున్నారని, అయితే, ప్రజలు టీజీ కుటుంబాన్ని నమ్మరన్నారు. తండ్రి ఒక పార్టీ, కొడుకు ఒక పార్టీ జెండాలు పట్టుకొని తిరుగుతున్నారన్నారు. కరోనా సమయంలో కనీస మానవత్వం చూపకుండా గౌరీ గోపాల్ ఆసుపత్రిలో రోగుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేశారన్నారు. పేదలపై నిజంగా ప్రేమ ఉంటే ఎందుకు ఉచితంగా వైద్య సేవలు అందించలేదని ప్రశ్నించారు. మౌర్య ఇన్ హోటల్‌ను క్వారంటైన్‌గా మార్చి బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక 11వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఖడక్‌పురా వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, పార్టీ నాయకులు ఫైజల్‌ఖాన్, అబ్బాస్, దావూద్, షబ్బీర్, మాలిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ రోజు

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని ఓల్డ్ టౌన్, గనిగల్లి, చిన్న మార్కెట్, బండిమెట్ల, దండిగేరి, ఛత్రిబాగ్, అలిషేర్ బాగ్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఓల్డ్‌టౌన్ రూరల్స్ ఏఈ మధన్‌మోహన్ తెలిపారు.

సేవా సప్తాహం

కర్నూలు కల్చరల్: బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు 'సేవా సప్తాహం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బజరంగ్ దళ్ నగర సంయోజక్ భగీరథ, వీహెచ్‌పీ నగర కార్యదర్శి నాగరాజు తెలిపారు.

టీటీడీ కథల పోటీలు

కర్నూలు కల్చరల్: సీ క్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. విద్యార్థుల్లో దేశ భక్తి, దైవ భక్తి, సనాతన భారతీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు 'కథ చెబుతారా ఊ కొడతాం' అనే శీర్షికతో పోటీలు నిర్వస్తున్నట్లు పేర్కొన్నారు.

హజరత్ తాహెర్ గుల్షాన్ దర్గా జియారత్

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని చౌక్ బజార్‌లో వెలసిన హజరత్ తాహెర్ గుల్షాన్ దర్గా జియారత్ ఆదివారం నిర్వహించనున్నట్లు దర్గా సజ్జాద్ నషీన్ సయ్యద్ మొహమ్మద్ హుసేన్ పీర్ ఖాద్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.